
సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 19 । జనవరి । 2024



ఘనంగా సహస్ర తులసీదళార్చన

విశాఖ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు.



హార్బర్‌లో నో స్మోకింగ్

ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పొగ తాగడాన్ని పూర్తిగా నిషేధించారు.

8లో

ఘనమైన నివాళి



సాధారణంగా దేవుళ్ల పేరుతో తీర్థాలు నిర్వహిస్తారు. కె.జె.పురంలో మాత్రం దేశ నాయకుల విగ్రహాల వద్ద ప్రతి ఏటా జాతర జరుపుతారు.

8లో

న్యూస్‌రీల్

సురక్షిత ప్రయాణంతో ఆర్టీసీపై నమ్మకం

డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సుధాబిందు



సమావేశంలో మాట్లాడుతున్న సుధాబిందు

అనకాపల్లి: రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సీటీఎం సుధాబిందు చెప్పారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఉత్సవాలను ఫిబ్రవరి 14వ తేదీ వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. జీరో రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లు, మెకానిక్‌లు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం వలన ఆర్టీసీపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లతోపాటు మెకానిక్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జోన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మాసోత్సవాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చామన్నారు. డిపో మేనేజర్ సుజాత, ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్ర, ఆర్టీసీ సెక్యూరిటీ సబ్ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ వూషూ పోటీలకు నర్సీపట్నం విద్యార్థులు



నేషనల్ పోటీల్లో పాల్గొంటున్న వూషూ ఫైటర్స్

నర్సీపట్నం: ఈ నెల 19 నుంచి 22 వరకు కోయంబత్తూరులో జరుగుతున్న ఖేల్ ఇండియా సౌత్ జోన్ నేషనల్ వూషూ చాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం నుంచి ఏడుగురు ఫైటర్స్ పాల్గొంటున్నారని కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న రాజరాజేశ్వరి, కె.శర్వాణి, కె.శరణ్య, నివేదిత, బిందుశ్రీ, దివ్య హారిక, అంకితను నింజాస్ అకాడమీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ బోశం శివ, హెచ్‌ఎం ఆర్‌వి.నరసింగరావు, పీడీ దేవి అభినందించారు.

రిపబ్లిక్ డే వేడుకలకు పాలిటెక్నిక్ విద్యార్థి



అనిల్‌కుమార్

అచ్యుతాపురం: విజయవాడలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే క్యాంప్‌కు అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల డిప్లమో విద్యార్థి అనిల్‌కుమార్ ఎంపికయ్యాడు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఈ అవకాశం దక్కించుకున్న 12 మంది ఎన్‌సీసీ క్యాడెట్లలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో మూడో సంవత్సరం చదువుతున్న జి.అనిల్ కుమార్ ఉన్నాడని ఎన్‌సీసీ అధికారి మణికంఠ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ప్రసాద్ అనిల్‌కుమార్‌ను అభినందించారు.

మిలాన్‌కు పటిష్ట భద్రత



మాట్లాడుతున్న సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్

విశాఖ సిటీ: నావికాదళం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లలో బీచ్ రోడ్డులో నిర్వహించనున్న మిలాన్–2024కు పటిష్ట భద్రతా చర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో నేవీ, పోలీస్ ఉన్నతాధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. మిలాన్‌కు ఇతర దేశాల నుంచి పలువురు ప్రముఖులు, ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలువురు వీవీఐపీ, వీఐపీలు వచ్చే అవకాశం ఉండడంతో వారి పర్యటన, సభా ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యాలు, అధికారులు, సిబ్బందికి వసతి ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైమ్) పల్లా వెంకటరత్నం, నేవీ ఉన్నతాధికారులు, ట్రాఫిక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్.. సలాం మార్కెట్

పెట్టుబడి వారిదే.. నిర్వహణ వారిదే.. లాభాలు వారివే..

స్వయం సహాయక సంఘాల సభ్యులతో మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన ఇప్పుడు అతివలను అందలమెక్కిస్తోంది. వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతోంది. జిల్లాలో ఇంతవరకు ప్రారంభించిన నాలుగు మార్ట్‌లు రోజుకు లక్షలాది రూపాయల వంతున వ్యాపారం చేస్తున్నాయంటే.. తక్కువ ధరకు అక్కడ లభిస్తున్న నాణ్యతే కారణం.

- తక్కువ ధరకే నాణ్యత గల సరకులు
- స్వయం సహాయక సంఘాల సభ్యులే యజమానులు
- వారి నిర్వహణలో లాభాల బాట
- అత్యధికంగా ఒక్క రోజులో రూ.4 లక్షల విక్రయాలు
- రాష్ట్రస్థాయిలో టాప్ 3 స్థానాల్లో కొనసాగుతున్న జిల్లా మార్ట్‌లు

తుమ్మపాల: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులతో జిల్లాలో ఏర్పాటు చేసి నాలుగు చేయూత మహిళా మార్ట్‌లు లాభాల బాటలో దూసుకుపోతున్నాయి. గడిచిన ఆరు నెలల కాలంలో రాష్ట్రస్థాయిలో మొదటి మూడు స్థానాల్లో కొనసాగుతుండడంతో మహిళలు మరింత ఉత్సాహం కనబరుస్తున్నారు. వైఎస్సార్ చేయూత మార్టుల్లో అన్ని రకాల కిరాణా సామగ్రి, ఆహార పదార్థాలు, హస్తకళారూపాలు, పాల ఉత్పత్తులు లాంటివి అందుబాటులో ఉన్నాయి. 70,000 మంది మహిళల భాగస్వామ్యంతో నాణ్యమైన సరకులను బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకే విక్రయిస్తుండటంతో ప్రజాదరణ ఎక్కువగా ఉంది. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో మహిళల స్వయం ఉపాధి ఉత్పత్తి సంస్థల్లో తయారు చేస్తున్న వస్తువులను కూడా మార్ట్‌లో విక్రయిస్తున్నారు.

ఒక్క రోజులో రూ.4 లక్షల విక్రయాలు

జిల్లాలో మాడుగుల, చోడవరం, సబ్బవరం, మాకవరపాలెం ప్రాంతాల్లో కొనసాగుతున్న మార్ట్‌లు రోజుకు రూ.లక్ష నుంచి రూ.4 లక్షల విలువైన వస్తువులను విక్రయిస్తున్నాయి. గడిచిన పది రోజుల్లో జిల్లాలో అన్ని మార్టుల్లో రూ.47 లక్షల 61 వేల 119ల వ్యాపారం జరిగింది. ఒక్క సబ్బవరం మార్ట్‌లో ఈ నెల 10వ తేదీన రూ.4,21,179లు విక్రయాలు జరిగాయి. ఈ రికార్డుతో రాష్ట్రంలోనే సబ్బవరం మార్ట్ ప్రథమ స్థానంలో నిలిచింది. కొత్తగా ఈనెల 8వ తేదీన మాకవరపాలెంలో ప్రారంభించిన మాకవరపాలెం మార్ట్‌లో కూడా ప్రతి రోజు లక్షకు పైగా విక్రయాలు జరుగుతున్నాయి. వీటి ఆధారంగా జిల్లాలో మరో ఎనిమిది చోట్ల మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయాలని మహిళా సభ్యులు కోరుతున్నారు.

బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధర.. ఎక్కువ నాణ్యత

ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నో మార్ట్‌లు ఉన్నాయి. చిన్న చిన్న మార్ట్‌ల నుంచి.. కార్పొరేట్ మార్ట్‌ల వరకు అనేకం దర్శనమిస్తున్నాయి. అనేకమైన డిస్కౌంట్‌లు, ఆఫర్లను యాడ్‌ల రూపంలో ప్రదర్శిస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. వాటికి భిన్నంగా ఎటువంటి యాడ్‌లు లేకుండా ఏర్పాటు చేసినా.. ఈ మార్టుల్లో వస్తువుల ధరలు తక్కువగా ఉండటం, నాణ్యత పాటించడంతో ప్రజలు వీటిలో కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకే ఇవి లాభాల బాటలో నడుస్తున్నాయి.



మాకవరపాలెం మహిళా మార్ట్ ర్యాకుల్లో సరకులు

పది రోజుల్లో మహిళా మార్టుల్లో సాగిన విక్రయాలు (రూపాయలలో)

జనవరి	మాడుగుల	సబ్బవరం	చోడవరం	మాకవరపాలెం
1	51,709	1,05,466	20,066	---
2	1,01,453	1,84,261	1,32,209	---
3	36,210	1,46,796	1,97,652	---
4	1,02,515	1,26,536	1,50,463	---
5	82,545	1,94,734	67,972	---
6	72,032	1,23,366	1,06,876	---
7	63,201	1,11,552	1,29,670	---
8	1,61,837	1,72,987	2,49,187	1,04,090
9	1,80,298	2,45,018	2,66,492	1,16,511
10	2,00,456	4,21,179	2,32,787	1,01,993
మొత్తం	10,52,256	18,31,895	15,53,374	3,22,594

మహిళలే మహారాణులు

ఈ మార్టులకు ఓ ప్రత్యేకత ఉంది. ప్రతి మహిళా సభ్యురాలు యజమానిగా ఉంటారు. వారే నిర్వహిస్తారు. ప్రతి సభ్యురాలు తమ వ్యాపార వాటాగా రూ.200 చెల్లిస్తున్నారు. ప్రతి మార్ట్‌కు మహిళలే బోర్డు సభ్యులుగా ఉంటారు. సిబ్బంది, మార్ట్ నిర్వహణ బాధ్యతలన్నీ ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులే నిర్వహిస్తున్నారు. లాభాలను ప్రతి ఏటా లెక్కించి మార్ట్ విస్తరణకు కొంత ఖర్చు చేయాలని, మిగతా మొత్తాన్ని వాటాదారులకు పంచాలని తీర్మానాలు చేసుకున్నారు. సభ్యుల చందాలతో మాడుగులలో రూ.31.67 లక్షలు, చోడవరంలో రూ.46.33 లక్షలు, సబ్బవరంలో రూ.35.19 లక్షలు, మాకవరపాలెంలో రూ.35.12 లక్షలు వెచ్చించి మార్ట్‌లను నెలకొల్పారు. సభ్యుల వాటా నగదుతో వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకుని వస్తువులను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి మార్ట్‌లో విక్రయిస్తున్నారు.



మహిళా సభ్యులతో సబ్బవరం మహిళా మార్ట్

రాష్ట్రంలో టాప్-3 స్థానాల్లో మన మహిళా మార్ట్‌లు



ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులను ఆర్థికంగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో మహిళలను యాజమానులుగా చేస్తూ వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లను నిర్వహిస్తున్నాం. ఈ పథకం ద్వారా మహిళలకు వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశం కల్పించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. పూర్తి నాణ్యతతో మార్కెట్ కన్నా తక్కువ ధరకే సరకుల విక్రయాలు జరుగుతున్నాయి. అందుకే మహిళలు ఎక్కువగా ఇక్కడే సరకులు కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్ యాజమానులకు నష్టాలు వస్తాయనే మార్ట్‌లపై చెడు ప్రచారం చేస్తున్నారు.

–శచీదేవి, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్

నాణ్యతతో పాటు తక్కువ ధరకే సరకులు



నేను గత ఆరు నెలల నుంచి మా ఇంటికి సరిపడా సరకులన్నీ మార్ట్‌లోనే కొనుగోలు చేస్తున్నాను. బయట మార్కెట్ కన్నా ఇక్కడ తక్కువ ధరకు లభిస్తున్నాయి. నాణ్యతతో కూడిన మంచి బ్రాండెడ్ సరకులు ఉన్నాయి. జీడి పప్పు (గుండు పప్పు) కేజీ దగ్గర రూ.150 వరకు తగ్గగుంది. ఇలా ప్రతి వస్తువుపైన తక్కువ ధరలు ఉన్నాయి. మా గ్రామంలో చాలా మంది ఇక్కడే సరకులు కొనుగోలు చేస్తున్నారు.

–కొమ్ము పద్మ, గొల్లలపాలెం, సబ్బవరం మండలం

అన్ని సరకులు ఒక దగ్గరే



చోడవరంలో మా మహిళలమంతా ఏర్పాటు చేసుకున్న మార్ట్‌లో అన్ని సరకులు దొరుకుతున్నాయి. పొద్దస్తమానం పనిలోకి వెళ్లి ఇంటికి వచ్చిన తరువాత సాయంత్రం ఏ సమయానికి వెళ్లినా కూడా మార్ట్‌లో సరకులు దొరుకుతున్నాయి. మార్ట్ పెట్టకముందు సరకులు కొనుక్కోడానికి చాలా ఇబ్బందులు పడేవారం. షాపుల్లో అన్ని సరకులు ఉండేవి కాదు. రెండు మూడు షాపులు తిరిగితే గాని వస్తువులు దొరికేవి కాదు. ఇప్పుడా బాధ లేదు.

–సుర్ల ఈశ్వరమ్మ, గాంధీగ్రామం, చోడవరం

175 స్థానాల్లో గెలుపే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ
- ఈ నెల 25న భీమిలిలో బహిరంగ సభ
- సభ నిర్వహణపై పార్టీ ముఖ్యనేతలతో సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్

సాక్షి, విశాఖపట్నం: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఈ నెల 25న భీమిలిలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ సభ నిర్వహణపై గురువారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో గురువారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభకానుందని, ఇందులో భాగంగా భీమిలిలో నిర్వహించే భారీ బహిరంగ సభ దద్దరిల్లాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు సభకు తరలిరావాలన్నారు. ఈ సభలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి ప్రజలకు వివరిస్తారన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఐదు జోన్లగా విభజించామని.. సీఎం జగన్ అధ్యక్షతన అన్ని జోన్లలో కేడర్‌తో సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. వచ్చే ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ భేటీలు జరుగుతాయని వెల్లడించారు. తొలి బహిరంగ సభ ద్వారా ఉత్తరాంధ్ర కార్యకర్తలు, అభిమానులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారన్నారు. ఉత్తరాంధ్రపై సీఎం జగన్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందని, అందుకే ఈ ప్రాంతం నుంచి ఎన్నికల శంఖారావం పూరిస్తున్నట్లు వివరించారు. ఎవరికి ఎమ్మెల్యే.. ఎవరికి ఎంపీ టికెట్ ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి నిర్ణయిస్తారని చెప్పారు.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఇందుకూరి రఘురామరాజు, సురేష్‌బాబు, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్, పరీక్షిత్‌రాజు, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొర్లె కిరణ్‌కుమార్, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, విశ్వసరాయి కళావతి, పాముల పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, కె.భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబూరావు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఇన్‌చార్జిలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, పిరియా విజయ, డాక్టర్ తాలే రాజేష్, మత్సరాస విశ్వేశ్వరరాజు, ఉరుకూటి రామచంద్రరావు, మలసాల భరత్‌కుమార్, ముఖ్య నాయకులు సుకుమార్‌వర్మ, ఈర్లె అనురాధ, తమ్మినేని చిరంజీవి, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.




• మహా నైవేద్యం

వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు గురువారం కనులపండువగా సాగింది. మహిళలు పలు రకాల పిండివంటలు తయారు చేసి సారె ఊరేగింపును ఘనంగా జరిపారు. ఆలయంలో అమ్మవారికి సారె నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. –అనకాపల్లి

గృహ లబ్ధిదారులకు మరింత సాయం

13,994 మందికిరూ.1.34 కోట్ల వడ్డీ రాయితీ



మహిళలకు వడ్డీ రాయితీ చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో 13,994 మంది గృహ లబ్ధిదారులకు రూ.1.34 కోట్ల వడ్డీ రాయితీ ఇచ్చినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మహిళలకు చెక్కును అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేదవారి సొంతింటి కల సాకారమయ్యేందుకు ప్రభుత్వం జిల్లాలోని 1394 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న అదనపు రుణంపై మొదటి విడత వడ్డీ రాయితీగా ఈ సొమ్మును జమ చేస్తోందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తూ వారి స్వంత ఇంటి కలను నిజం చేస్తూ 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ సొమ్మును జమ చేశారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందరూ వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 43,904 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున రూ.154.67 కోట్ల మేర అదనపు రుణ సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. తదుపరి దశకు ఇళ్ల నిర్మాణ పురోగతి సాధించిన వారిలో ఇప్పటి వరకూ 13,994 మందికి రూ.1,33,67,055ల మేర తొలి విడత వడ్డీ రాయితీ సొమ్ము వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ప్రతి లబ్ధిదారు సొంత ఇంటి నిర్మాణం చేపట్టి ప్రభుత్వం అందచేస్తున్న ప్రోత్సాహం ద్వారా ప్రయోజనం పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో ఎస్‌సీడీ, గృహనిర్మాణ శాఖ పీడీ కె.రమామణి, డీఆర్డీఏ పీడీ శచీదేవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

ఆహార శాంపిళ్ల సేకరణ

యలమంచిలి రూరల్: ఆహార భద్రత అధికారులు గురువారం రాత్రి పలు హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 16వ నెంబరు జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న హోటళ్లలో జరిపిన తనిఖీల్లో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు బి.రవికుమార్, ఎస్.శ్రీజ ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రయోగశాలలకు పంపించారు. యలమంచిలి సమీపంలో ఉన్న గ్రీన్‌లాండ్ రెస్టారెంట్‌లో చికెన్ పకోడి, అడ్డురోడ్డు వద్ద శ్రీ వెంకటేశ్వర అశోక్ రెస్టారెంట్‌లో వెజిటబుల్ ఫ్రైడ్ రైస్, సన్‌రైజ్ రెస్టారెంట్‌లో చికెన్ కబాబ్ శాంపిళ్లను సేకరించిన అధికారులు వాటికి సీళ్లు వేసి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. నిల్వ ఉన్న హానికరమైన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్టు తమ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు వచ్చిందని, వారి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ప్రయోగశాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హానికరమైనవిగా తేలితే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెడతామన్నారు. నాణ్యత లోపిస్తే రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు జరిమానా ఉంటుందన్నారు. తనిఖీలు చేపట్టిన హోటళ్లు, రెస్టారెంట్లలో వంట నూనె నాణ్యతను టీపీసీ పరికరంతో పరిశీలించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఆహార భద్రత కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆహార పదార్థాల శాంపిళ్లు



రెస్టారెంట్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

క్లుప్తంగా

బస్సు కింద పడి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన క్రాంతికిరణ్

ఎస్.రాయవరం: మండలంలో గోకులపాడు జాతీయ రహదారిపై ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన వి.క్రాంతికిరణ్ (57) రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. మృతుడు క్రాంతికిరణ్ రెండు రోజుల క్రితం గోకులపాడులోని బంధువుల ఇంటికి వచ్చినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. కాగా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు వేరొక బస్సు ఏర్పాటు చేయకపోవడంతో బస్సులోని మిగతా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడిన శేషుకుమారి

యలమంచిలి రూరల్: పట్టణ పరిధి 16వ నంబరు జాతీయ రహదారిపై కొక్కిరాపల్లి కూడలి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో న్యాయవాది వద్ద గుమస్తాగా పని చేస్తున్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మున్సిపాలిటీ పరిధి చినగొల్లలపాలెం గ్రామానికి చెందిన మురుకుర్తి శేషుకుమారి అనకాపల్లిలో ఓ న్యాయవాది వద్ద గుమస్తాగా పని చేస్తున్నారు. గురువారం విధులు ముగించుకుని సొంతూరు వెళ్లేందుకు బయలుదేరారు. కొక్కిరాపల్లి కూడలి వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతున్న సమయంలో అనకాపల్లి నుండి యలమంచిలి వైపు వస్తున్న కారు శేషుకుమారిని ఢీకొట్టింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. యలమంచిలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ నేతలకు.. ఘనమైన నివాళి



గాంధీ వీధిలోని జాతిపిత విగ్రహం



పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ



ప్రధాన కూడలిలోని బోస్ విగ్రహం



పాల సొసైటీ వద్ద అల్లూరి విగ్రహం

- దేశ నాయకుల విగ్రహాలకు ప్రతి ఏటా తీర్థాలు
- ఐక్యతకు ప్రతీకగా కె.జె.పురం గ్రామస్తులు, యూత్ సభ్యులు
- 1950లోనే విజయవాడ నుంచి విగ్రహాలు తీసుకొచ్చిన మాజీ సర్పంచ్ శ్రీరామ్మూర్తి



పాలకుర్తి శ్రీరామ్మూర్తి (ఫైల్)

మాడుగుల రూరల్: దేవతామూర్తులు, గ్రామంలోని అమ్మవార్లకు సంక్రాంతి పండగ తర్వాత తీర్థాలు నిర్వహించడం ఆనవాయితీ. మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన కె.జె.పురంలో అమ్మవార్లు, దేవతామూర్తులతో పాటు స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన నాయకుల విగ్రహాలకు ప్రతి ఏటా తీర్థాలు నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. జాతి పిత మహాత్మాగాంధీ, దివంగత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్ర బోస్, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వంటి నేతల విగ్రహాలు కె.జె.పురంలో ప్రతిష్ఠించారు. అలాగే వీధులకు నాయకుల పేర్లు కూడా పెట్టారు. ఈ గ్రామ తొలి సర్పంచ్ దివంగత పాలకుర్తి శ్రీరామ్మూర్తి 1950లో విజయవాడ నుంచి జాతీయ నాయకుల విగ్రహాలను రైలు మీద అనకాపల్లి వరకు తీసుకొచ్చి, అక్కడి నుంచి నాటు బండ్ల మీద గ్రామానికి వాటిని చేరవేయించేవారు. తర్వాత వాటిని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించేవారు. ఆయన తన సొంత సొమ్ముతో ఈ మహత్తర కార్యం నిర్వహించేవారు. అలా ఏర్పాటు చేసిన ఆయా విగ్రహాలకు అప్పట్లో తీర్థాలు నిర్వహించడం ప్రారంభించారు. ఆయన అప్పట్లో జిల్లా బోర్డు సభ్యునిగా వ్యవహరించేవారు. అలాగే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఈ గ్రామానికి చెందిన మాజీ సైనికోద్యోగి అతికంశెట్టి సింహాచలం సొంత నిధులతో తయారు చేయించి, పాలసొసైటీ వద్ద ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ముకుందపురం మాజీ సర్పంచ్, దివంగత కర్రి శ్రీరామ్మూర్తి ఆర్థిక సహకారంతో కాలనీలో ఏర్పాటు చేశారు. గాంధీ తీర్థం ప్రతి ఏటా జనవరి 31న గాంధీ వీధి ప్రజలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు ప్రతి ఏటా అక్టోబర్ 2న గాంధీ జయంతి నిర్వహిస్తుంటారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని జనవరి 23వ తేదీన ఆయన పేరిట తీర్థం నిర్వహిస్తుంటారు. నెహ్రూ తీర్థం ప్రతి ఏటా ఫిబ్రవరి 8వ తేదీన నెహ్రూ వీధిలో నిర్వహిస్తున్నారు. గ్రామంలో గల రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి, వర్ధంతులను నిర్వహించి, క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తుంటారు. ఇలా దేశ నాయకుల పేరిట తీర్థాలు నిర్వహించటమనే మంచి సంప్రదాయం ఇక్కడే కనిపిస్తుంది. వీరితో పాటు మాజీ ప్రధానులు ఇందిర, రాజీవ్‌గాంధీ జయంతి, వర్ధంతులు నిర్వహిస్తు స్థానికులు దేశ సమైక్యత చాటుతున్నారు. కె.జె.పురంలో ఐక్యత వెల్లివిరుస్తుంటుంది. ఆ గ్రామంలో దేశ నాయకుల విగ్రహాల వద్ద ప్రతి ఏటా తీర్థాలు జరుగుతుంటాయి. 1950లోనే నాటి సర్పంచ్ పాలకుర్తి శ్రీరామూర్తి గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి నాయకుల విగ్రహాలను విజయవాడ నుంచి సొంత నిధులతో తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠింపజేశారు. ఆ విగ్రహాల వద్ద గ్రామస్తులు తీర్థాలు నిర్వహిస్తూ ఐక్యత చాటుతున్నారు. అలాగే ఇక్కడి వీధులకు కూడా దేశ నాయకుల పేర్లు పెట్టటం మరో విశేషమనే చెప్పాలి.

ఐక్యతకు ప్రతీక..



దేశ నాయకుల విగ్రహాలకు తీర్థాలు నిర్వహించడం కె.జె.పురంలో ఆనవాయితీగా వస్తోంది. కీర్తిశేషులు పాలకుర్తి శ్రీరామూర్తి కృషితో జాతీయ నాయకుల విగ్రహాలు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాల వద్ద ఆయా నేతల జయంతి, వర్ధంతులు నిర్వహించటం గొప్ప విషయం. ఐక్యతకు ప్రతీకగా కె.జె.పురం గ్రామం నిలుస్తోంది.

– జామి రమణబాబు, సర్పంచ్, కె.జె.పురం గ్రామం, మాడుగుల మండలం

గ్రామానికి చక్కటి పేరొచ్చింది..



1950లో గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను విజయవాడ నుంచి రైలులో ఇక్కడికి తీసుకొచ్చారు. నాటి నుంచి ఆ విగ్రహాలకు తీర్థాలు నిర్వహిస్తున్నారు. అలాగే దేశ నాయకుల పేర్లతో ఇక్కడ వీధులు కూడా ఏర్పాటు అయ్యాయి. పోస్టల్ అడ్రస్‌లో గాంధీ వీధి, నెహ్రూ వీధి అని ప్రాచుర్యం పొందాయి. ఆ పేర్లతో చిరునామాలు కూడా వున్నాయి. పాలకుర్తి శ్రీరామూర్తి కృషితో గ్రామానికి చక్కటి పేరొచ్చింది.

– రాపేట సత్యనారాయణ, సోషల్ వర్కర్, కె.జె.పురం, మాడుగుల మండలం

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



సూరిశెట్టి ఉమామహేశ్వరరావు

కశింకోట: స్థానిక గోవిందరావు కాలనీకి చెందిన సూరిశెట్టి ఉమామహేశ్వరరావు (31) కనిపించకపోవడంపై గురువారం కేసు నమోదు చేశామని సీఐ ఎం. వినోద్‌బాబు తెలిపారు. అనకాపల్లిలోని ప్రైవేటు షాపింగ్ మాల్‌లో పని చేస్తున్న అతను బుధవారం ఉదయం ఇంటి నుంచి విధులకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఎక్కడ వెదికినా ఆచూకీ తెలియకపోవడంతో సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు.

దాడి కేసులో ఏడుగురికి రిమాండ్



విలేకరులకు కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సుబ్బరాజు

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో యువకుడిపై దాడి చేసి గాయపరిచిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు. గురువారం రాత్రి బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 16వ తేదీన వడ్డాది సినిమా హాలు దగ్గరలో ఇదే గ్రామానికి చెందిన బొర్రా దుర్గా తేజపై కొంత మంది యువకులు కత్తి, రాయి, కర్రలతో దాడి చేయడంతో అతని మెడ, వీపు మీద బలమైన గాయాలయ్యాయి. అదే రోజు అతని కుటుంబ సభ్యులు దుర్గాతేజను చోడవరం ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి, విశాఖ కేజీహెచ్‌కు తరలించారన్నారు. దుర్గాతేజ బంధువు భూపతిరాజ బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో హత్యానేరం, ఎస్సీ, ఎస్టీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. ఈ దాడికి సంబంధించి ఏడుగురు వ్యక్తులు అదట్రా శ్రీరామ్, కొరసాల గణేష్, వెలుగుల సాయికుమార్, మాగాం త్రినాథరావు, గండెం ప్రసాద్, సుంకరి కిరణ్ రాజు, వెలుగుల సురేంద్రలను అరెస్ట్ చేసి చోడవరం కోర్టుకు తరలించామన్నారు. వీరికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో విశాఖ సెంట్రల్ జైలుకి తరలించామన్నారు. ప్రస్తుతం బాధితుడు దుర్గాతేజ కోలుకుంటున్నాడన్నారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా సినిమా హాలు దగ్గరలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఇరువర్గాల కుటుంబ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఇకపై గొడవలు జరగకుండా చర్యలు తీసికుంటామన్నారు. కొత్తకోట సీఐ అప్పల నాయుడు, ఎస్‌ఐ డి. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అనకాపల్లి: మండలంలో సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట ఏలేరు కాలువలో గురువారం గుర్తు తెలియని మృతదేహం బయటపడిందని పట్టణ సీఐ జి.శంకరరావు చెప్పారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలుంటుందని, మృతుడు ఆరెంజ్ కలర్ షర్ట్, బ్లాక్ కలర్ షార్ట్ ధరించినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు 9490737758, 9154879719 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వివాదానికి దారి తీసిన రోడ్డు ప్రమాదం

డీఎస్పీ చొరవతో సద్దుమణిగిన సమస్య



పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న రెండు వర్గాలు



రెండు వర్గాల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

చోడవరం రూరల్: రెండు వాహనాల మధ్య ప్రమాదం, ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం, రెండు సామాజిక వర్గాల మధ్య తగవుగా మారింది. అనకాపల్లి డీఎస్పీ రంగ ప్రవేశంతో సమస్య సద్దుమణిగింది. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ శివారు అన్నవరం గ్రామంలో బుధవారం తీర్థం జరిగిన సమయంలో చినబజారు జంక్షన్ వద్ద రేవళ్ల గ్రామానికి చెందిన వ్యక్తి బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న చెరకు లారీ ఢీకొట్టడంతో బైకుపై వెళ్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న పినబాల సూరిబాబుకు లారీ డ్రైవర్ పరిచితుడు కావడంతో గాయపడిన బైకిస్టును ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించాలని సూచించాడు. దీనికి అక్కడే ఉన్న సమ్మంగి రాము అడ్డు చెప్పాడు. కేవలం వైద్యం చేయిస్తే సరిపోతుందా అని ప్రశ్నించాడు. దీంతో సూరిబాబు, రాము మధ్య వాదులాట ప్రారంభమై అది కాస్త గొడవకు దారి తీసింది. ఇది రెండు కులాల మధ్య తగవుగా మారింది. గురువారం నాటికి రెండు కులాల వారు చోడవరం పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఒక వర్గంపై వేరొక వర్గం వారు ఫిర్యాదు చేసుకుని, నినాదాలకు దిగారు. అయితే రోడ్డు ప్రమాదం ఇంతటి గొడవకు కారణం కాగా గాయపడిన వ్యక్తి నుంచి చోడవరం పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. దీంతో అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు చోడవరం పోలీస్ సర్కిల్ స్టేషన్‌కు చేరుకుని రెండు కులాల పెద్దలను పిలిపించి గొడవ సద్దు మణిగించారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ సేవలు

ఏయూక్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని యూఈఐ జీబీ డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. www.employment.ap.gov.in ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అప్‌డేషన్ తదితర సేవలను పొందవచ్చని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని సూచించారు.

అకుంఠిత దీక్షతో ఆశయ సాధన

తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐగా ఎంపికైన యువకుడు



రవికుమార్

కశింకోట: సేవ చేయాలనే సంకల్పం, అకుంఠిత దీక్షతో గ్రామీణ యువకుడు ఎస్‌ఐ ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని మారుమూల ఉన్న అచ్చెర్ల గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి చెందిన యువకుడు మొదటి ప్రయత్నంలోనే ఎస్‌ఐగా ఎంపికయ్యారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన బొడ్డేడ గంగరాజు, మాణిక్యం దంపతుల రెండో కుమారుడు 24 ఏళ్ల రవికుమార్. బీటెక్ మెకానికల్ చదివారు. రెండున్నరేళ్ల పాటు ఏలూరు, కాకినాడల్లో ప్రత్యేక శిక్షణ తీసుకుని ఉద్యోగం సాధించడమే ధ్యేయంగా మరో ధ్యాస లేకుండా చదివారు. కబడ్డీలో అంతర్రాష్ట్ర స్థాయిలో ఆడారు. దీంతో ఎస్‌ఐ పరీక్షలో శారీర దారుఢ్యం, రన్నింగ్‌లో సునాయాసంగా నెగ్గి రాత పరీక్షలో ర్యాంకు సాధించి ఎస్‌ఐ పోస్టుకు ఎంపికయ్యారు. త్వరలో అనంతపురం పోలీస్ అకాడమీలో శిక్షణకు వెళ్లనున్నారు. ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పం, తన సోదరుల ప్రోత్సాహంతో ఎస్‌ఐగా తొలి ప్రయత్నంలోనే ఎంపికైనందుకు ఎంతో ఆనందంగా ఉందని రవికుమార్ తెలిపారు. పోలీసు శాఖలో అవినీతి రహితంగా సేవలందించడమే ధ్యేయమని తెలిపారు.

కులగణనపై అవగాహన కల్పించాలని వినతి



ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేస్తున్న దళిత పరిరక్షణ నాయకులు

నర్సీపట్నం: కులగణనపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సేన పరిరక్షణ నాయకుడు డి.దాసు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆర్డీవో హెచ్‌వి జయరాంకు గురువారం వినతి పత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో కనీస అవగాహన కల్పించలేదని, ఇప్పటికైనా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. బి.యల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

హార్బర్‌లో నో స్మోకింగ్!

- గృహ వినియోగ సిలిండర్లకు అనుమతి లేదు
- వేటకు వెళ్లే ముందే బోట్లలో డీజిల్ నింపాలి
- పర్యవేక్షణకు రెండు జెట్టీలకో సాగర మిత్ర నియామకం
- ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంతో అప్రమత్తం



సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పొగ తాగడాన్ని నిషేధించారు. నవంబర్ 19 అర్ధరాత్రి హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 38 బోట్లు పూర్తిగాను, 18 బోట్లు పాక్షికంగాను దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చేపలరేవులో మున్ముందు అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం ఈ హార్బర్‌లో ఇకపై ఎవరూ పొగతాగడానికి వీల్లేదు. అగ్ని ప్రమాదాలకు అవకాశం ఉన్నందున బోట్లలో డీజిల్, గ్యాస్ నిల్వ ఉంచరాదని స్పష్టం చేసింది. ఇన్నాళ్లూ వేటకెళ్లే బోట్లలో చాలామంది బోటు యజమానులు గృహ వినియోగ (డొమెస్టిక్) సిలిండర్లను వంట కోసం తీసుకెళ్తున్నారు. ఇకపై వాటిని అనుమతించరు. ఈ పెద్ద గ్యాస్ సిలిండర్లకు బదులు రీఫిల్లింగ్‌కు వీలయ్యే చిన్న సిలిండర్లను మాత్రమే వాడాలని మత్స్యశాఖ నిర్దేశించింది. వేటకెళ్లే సమయంలోనే బోట్లలో డీజిల్ నింపుకోవాలని, లంగరు వేసిన బోట్ల ట్యాంకుల్లో ముందుగా డీజిల్ నింపి నిల్వ ఉంచవద్దని స్పష్టం చేసింది. అలాగే బోట్ల కేబిన్ పక్కన అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. ఇవన్నీ సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించడానికి రెండు జెట్టీలకు ఒక సాగరమిత్ర చొప్పున నియమిస్తున్నారు. వీరు రేయింబవళ్లు హార్బర్‌లో షిఫ్టుల వారీగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు.

బ్యానర్లు, పోస్టర్లు సిద్ధం

పోర్టు యాజమాన్యం నిర్ణయాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హార్బర్‌లో చేయకూడని, చేయాల్సిన పనులను పేర్కొంటూ ప్రత్యేక పోస్టర్లు, బ్యానర్లను సిద్ధం చేశారు. వీటిని హార్బర్‌లో వివిధ చోట్ల ఏర్పాటు చేస్తున్నారు. రెండ్రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. హార్బర్‌లో అగ్ని ప్రమాదాలకు తావులేకుండా పోర్టు యాజమాన్యం తీసుకుంటున్న చర్యలపై బోటు యజమానులు, కళాసీలకు మత్స్యశాఖ అధికారులు వివరిస్తున్నారు. తొలుత మత్స్యకార సంఘాల నాయకులకు, ఆ తర్వాత యజమానులు, కళాసీలకు అవగాహన కల్పించనున్నారు.

హార్బర్ బయటే సందర్శకుల వాహనాలు

హార్బర్‌కు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు చేపల రేవులో పొగ తాగడాన్ని నిషేధించిన సంగతి తెలుసుకునేలా ఆటోలపై బ్యానర్లను అతికించనున్నారు. అలాగే పర్యాటకులు, సందర్శకులు వచ్చే ఆటోలు, వాహనాలను హార్బర్ బయటే నిలిపివేయనున్నారు. చేపలరేవులోని చీకటి ప్రదేశాల్లో రాత్రి వేళ అసాంఘిక శక్తులు, తాగుబోతులు తిష్ట వేయకుండా విద్యుద్దీపాలను మరింత విస్తృతం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలను మెరుగు పరుస్తూ కొత్తగా మరిన్ని హైపిక్సెల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి లాల్ మహ్మద్ 'సాక్షి'కి చెప్పారు. హార్బర్‌లో నో స్మోకింగ్ నిబంధనను ఉల్లంఘిస్తే జీవీఎంసీ, పోలీస్ శాఖల సహకారంతో జరిమానా విధించే యోచన చేస్తున్నామన్నారు. హార్బర్‌లో భవిష్యత్తులో అగ్ని ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు శ్యామలరావు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకులు శ్యామలరావు

సాక్షి, విశాఖపట్నం : ఓటర్ల జాబితా రూపకల్పనలో పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు జిల్లా అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా యువ ఓటర్ల నమోదుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో మోహన్ కుమార్, ఈఆర్వోలతో ఓటరు జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియపై గురువారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు. పక్కా జాబితాను రూపొందించేందుకు అనురించే విధానాలపై దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా జాబితాలను పరిశీలిస్తూ పలు అంశాలపై ఆరా తీశారు. జిల్లాలోని జనాభా, ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల నిష్పత్తి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే చోట ఐదుకు మించి ఉన్న పోలింగ్ స్టేషన్ల వివరాలను అడిగిన ఆయన భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఫైనల్ జాబితా ప్రచురణ కాపీలను రాజకీయ పార్టీల జిల్లా ప్రెసిడెంట్ లేదా సెక్రటరీలకు అందజేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ జాబితాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ నెల 22న ఫైనల్ లిస్టు ప్రచురించనున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టామని జేసీ విశ్వనాథన్ తెలిపారు. సమీక్షలో ఈఆర్‌వోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, లక్ష్మారెడ్డి, మూర్తి, శేష శైలజ, అఖిల, ఎన్నికల సెల్ అధికారులు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.

బాలుడిని మింగేసిన సెప్టిక్ ట్యాంక్





కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి పార్వతి (ఇన్‌సెట్) మృతి చెందిన కౌశిక్ వికాస్

ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సంక్రాంతి పండగకు పెద్దమ్మ ఇంటికి వచ్చిన బాలుడు ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో జారి పడి దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ గంట్యాడ సంతోష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమలాపురానికి చెందిన ఉప్పాడ పార్వతి భర్త జగన్ కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆమె బతుకు తెరువు కోసం తన ఒక్కగానొక్క కుమారుడు కౌశిక్ వికాస్‌తో కలిసి ఏడాది క్రితం మధురవాడ సమీపంలోని వాంబే కాలనీకి వలస వచ్చింది. అక్కడ రోజు వారీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. కౌశిక్ వికాస్ పెద్దమ్మ కుమారి మండలంలోని వెల్లంకి ఎస్సీ కాలనీలో కుటుంబంతో ఉంటోంది. ఇదిలా ఉండగా కౌశిక్ వికాస్(7) సంక్రాంతి పండగకని వెల్లంకిలోని పెద్దమ్మ ఇంటికి మూడు రోజులు క్రితం వచ్చాడు. గురువారం ఉదయం ఆడుకోవడానికి పిల్లలతో బయటకు వెళ్లాడు. అలా వెళ్లిన కౌశిక్ వికాస్ ఎంతకీ ఇంటికి రాక పోవడంతో పెద్దమ్మ కుమారితో పాటు చుట్టు పక్కల వారు వెదికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. ఈలోగా సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటి పరిసరాలను పరిశీలించారు. నీటితో ఉన్న మూతలేని సెప్టిక్ ట్యాంక్‌లో బాలుడు మృతదేహం కనిపించింది. ఈ మేరకు తల్లి పార్వతికి, పోలీసులకు కుమారి సమాచారం అందించింది. ఎస్‌ఐ గంట్యాడ సంతోష్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, కుమారుడు అకాలంగా మృత్యువాత పడడంతో ఇంక తనకు దిక్కెవరంటూ కౌశిక్ వికాస్ తల్లి పార్వతి రోదిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించింది.

క్లుప్తంగా

వెనుకబడిన గ్రామాల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లి : మండలంలో అట్టడుగున వెనుకబడిన గ్రామాల అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై 2024–25 బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడినవారికి మౌలిక సదుపాయాల కల్పనకు గత ఏడాది జరిగిన అభివృద్ధిపై ఆయన చర్చించారు. దశలవారీగా అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్, ఎంపీటీసీలకు గ్రామాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ.నర్సింహారావు, వైస్ ఎంపీపీ అయితా రాము, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు పెతకంశెట్టి జోసెఫ్, ఈవోఆర్డీ ధర్మారావు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దుకు డిమాండ్

అనకాపల్లి : భూహక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. స్థానిక న్యాయసముదాయం ముందు గురువారం న్యాయవాదలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా న్యాయవాది సాయిలక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. దీక్షా శిబిరాన్ని న్యాయవాదులు ఎం.జి.వి.ఎస్ కుమార్, బొడ్డేడ రాజగోపాల్ సందర్శించి న్యాయవాదులకు మద్దతు తెలియజేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

కశింకోట: కశింకోటలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆటో స్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్, బసవరామతారకంల విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. తీడలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్ పూలమాల వేసి నివాళులర్పించారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 3,624 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,940	4,110
మొదటి రకం	3,520	4,100
రెండో రకం	3,580	3,640
మూడోరకం	3,000	3,470

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	రాజా
గుంటూరు కారం	సత్యనారాయణస్క్రీన్-1
హనుమాన్	సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	షిర్డిసాయి
సైంధవ్	పర్లిసాయి
సలార్ (రెండుషోలు)	వెంకటేశ్వర
గుంటూరు కారం(రెండుషోలు)	
నా సామిరంగ	శ్రీసత్య
హనుమాన్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 108 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-60 యూనిట్లు, ఏబీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ నెగిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 263 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 487 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

గైరమ్మ జాతరకు వేళాయె



వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయం



ఆలయంలో గౌరీపరమేశ్వరులు



సారె ఊరేగింపు ప్రారంభిస్తున్న 83వవార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి

- రేపే వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవం
- ఉత్సవానికి 170 చరిత్ర
- ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకర్షణగా నిలవనున్న బాణసంచా విన్యాసాలు

అనకాపల్లి : పట్టణంలో వేల్పులవీధిలో సుమారుగా 170 ఏళ్లక్రితం వేల్పులవారి స్వగృహంలో గౌరమ్మ వెలిసింది. స్వర్గీయ కొమ్మాన నర్సింగరావు భార్య పార్వతమ్మ మృతి చెందింది. తన భార్యపై అభిమానంతో కొంత స్థలంలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలని భావించారు. ఈ మేరకు 1920లో ఓ పాకలో గౌరమ్మను ప్రతిష్ఠించారు. వేల్పుల నూకాలమ్మ కుటుంబం అమ్మవారిని నిత్యం పూజించేది. జనవరి మొదటి వారంలో వేల్పులవీధి కుటుంబీకులు అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించేవారు. అయితే అప్పట్లో జనం ఎక్కువగా వచ్చేవారు కాదు.. అంతా సంక్రాంతి సంబరాలు వచ్చిపోయే బంధువుల సందడిలో ఉండిపోయేవారు.

అప్పటి నుంచి అమ్మవారి ఉత్సవం వేల్పులవీధికే పరిమితం కాకూడదని వీధిపెద్దలు స్వర్గీయ రౌతు ఆదినారాయణ, బోయిన రమణ మరికొందరు భావిస్తూ జనవరి మూడో శనివారం ఉత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అప్పట్లో నేలవేషాలు, బుర్రకథలు నిర్వహించేవారు.

ఉత్సవానికి మరిన్ని సొబగులు..

1983 తర్వాత ఉత్సవంలో కొద్ది మార్పులు చోటుచేసుకున్నాయి. రౌతు ఆదినారాయణ మరికొంతమంది సాయంతో సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఏర్పాటు చేయడం మొదలుపెట్టారు. దశలవారీగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఖ్యాతినార్జించాయి. ప్రస్తుతం 30 రకాల నేలవేషాలు, 20 స్టేజీ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత తరుణంలో సాంస్కృతిక కార్యక్రమాల సంఖ్య పెంచుతూ వచ్చారు.

అమ్మవారి ఊరేగింపు...

అమ్మవారి ఊరేగింపు మొదట్లో వేల్పులవీధిలో మాత్రమే జరిపేవారు. ప్రస్తుతం మూడురోజుల పాటు నిర్వహిసూ వస్తున్నారు. శనివారం ఉదయం నుంచి పట్టణపురవీధులగుండా ఊరేగింపు సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగిస్తూ స్థానిక శారదానదిలో నిమజ్జనం చేస్తారు. ఈ ఉత్సవానికి సుమారు 3 నుంచి 4లక్షల మంది భక్తులు హాజరుకానున్నట్లు ఉత్సవ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

నేలవేషాలు...బాణసంచా విన్యాసాలు

ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన కళాకారులతో పాటు ఒడిశాతోపాటు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కళాకారులతో నేలవేషాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఉత్సవమంటే ముందుగా గుర్తుకు వచ్చేది మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలే. వివిధ ఆకృతులు ఏర్పాటు చేసి, వాటికి మందుగుండు అమర్చి చేసే విన్యాసాలు కచ్చితంగా చూసి తీరాల్సిందే. ఎన్టీఆర్ మైదానంలో రెండుగంటలపాటు క్రేకర్స్ సందడితో పట్టణం మారుమోగనుంది.

అమ్మవారి ఆలయ నిర్మాణం..

అమ్మవారి గర్భగుడి వరకు మెయిన్‌రోడ్డు విస్తరణ జరిగింది. ఆలయానికి వెనుకభాగాన ఉన్న ప్రైవేటు స్థలాన్ని తీసుకొని పూర్తిస్థాయిలో గుడిని అందంగా తీర్చిదిద్దారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి సారె ఊరేగింపు గురువారం నేత్రపర్వంగా సాగింది. వీధి మహిళలు పలు రకాల పిండివంటలు తయారు చేసి రామాలయం వద్ద ఉంచగా సారె ఊరేగింపును 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. పలు రకాల పిండి వంటలు తయారు చేసిన భక్తులను ఆమె అభినందించారు. సారె ఊరేగింపు మెయిన్‌రోడ్డు గుండా చిననాలుగురోడ్ల కూడలికి చేరుకొని తిరిగి నెహ్రూ చౌక్ మీదుగా ఆలయానికి చేరుకుంది. అమ్మవారికి సారె నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, ఉపాధ్యక్షులు ఎస్.నర్సింగరావు, కార్యదర్శి మద్దాల నూకరాజు, సహాయ కార్యదర్శి పనస శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్, వీధిపెద్దలు ఉగ్గిన అప్పారావు, దోమరౌతు రామారావు, నల్లల దేముళ్లు, ముత్తా ఈశ్వరరావు గరికి వెంకటరావు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి...



ఈ ఏడాది గౌరీపరమేశ్వరుల అమ్మవారి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. నెలరోజులుగా కమిటీ ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నిశాఖల అధికారుల సమన్వయంతో అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేశాం.

– వాకాడ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

నాలుగు రోజుల పాటు విద్యుత్‌కు అంతరాయం

అనకాపల్లి : కశింకోట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నాలుగురోజుల పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తూరు, తుమ్మపాల, రొంగలివానిపాలెం, వేటజంగాలపాలెం, కుంచంగి, కూండ్రం, పిసినికాడ, సంపతిపురం, వెంకుపాలెం, విస్సన్నపేట, మూలపేట, సత్యనారాయణపురం, బవులవాడ, మామిడిపాలెం, మార్టూరు, గురున్నపాలెం, మాకవరం, మొండిపాలెం, పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం, కొండుపాలెం, సీహెచ్.ఎస్.అగ్రహారం, సుందరయ్యపేట, అచ్చియ్యపేట, మొండిపాలెం, సీతానగరం, గడబపేట, తగరంపూడి, మెట్టపాలెం, జగన్నాథపురం, దిబ్బపాలెం, ఊడేరు, అల్లిఖానుడుపాలెం తదితర గ్రామాల్లో ఈనెల 19 నుంచి 22వ తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లి : మండలంలో రేబాక సచివాలయం పరిధిలో సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం9 నుంచి 5 గంటల వరకూ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.వి. నరసింహారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సురక్ష కార్యక్రమంలో ఫ్యామిలీ వైద్యుడు, ఇద్దరు స్పెషలిస్టులు, కంటి వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉచితంగా రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయడం జరుగుతుందన్నారు.

కూరల ధరలు తగ్గుముఖం

కశింకోట: కశింకోటలోని వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. గత వారంతో పోల్చుకుంటే కిలోకి రూ.5 నుంచి రూ.10 తగ్గాయి. కిలో ఉల్లిపాయ, టమాటా రూ.30 నుంచి రూ.25కు తగ్గాయి. వంకాయ రూ.60 నుంచి రూ.30కి తగ్గింది. బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, దొండకాయ, బరబాటి రూ.40, బీట్రూట్, క్యారెట్ 60, బెండకాయ, బీరకాయ రూ.80కి విక్రయాలు సాగాయి. వెల్లుల్లి ధర మాత్రం ఎక్కువగా పెరిగింది. కిలో రూ.240కి విక్రయాలు సాగాయి.

ఘనంగా సమతా సంకల్ప మహోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శచీదేవి



మానవహారంగా ఏర్పడి మారథాన్ నిర్వహిస్తున్న దృశ్యం

అనకాపల్లి: సామాజిక సమానత్వ యోధుడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో గురువారం సమతా సంకల్ప మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 19న విజయవాడలో రాజ్యాంగాన్ని ప్రారంభిస్తున్నారని చెప్పారు. దేశ పరిపాలనకు అవసరమైన రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందించారని చెప్పారు. ప్రపంచదేశాల్లో ఉన్న రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి కొన్ని ముఖ్యమైన అంశాలు సేకరించి రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నారు. భారతదేశంలో అందరికీ సమానహక్కులు కల్పించి, మహిళలకు, పురుషులకు ఓటుహక్కు సమానంగా కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అంతకుముందు మానవహారంగా ఏర్పడి మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, జెడ్పీ ఎస్.వెంకటరమణ, సాంఘిక సంక్షేమశాఖ ఏడీ అజయ్‌కుమార్, డీఎస్‌వో రమణ పాల్గొన్నారు.

నూతన సీఐని కలిసిన ఉత్సవ కమిటీ



శంకరరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అనకాపల్లి: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పట్టణ సీఐ జి.శంకరరావును తన కార్యాలయంలో గురువారం వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈనెల 20న జరిగే గౌరీపరమేశ్వరుల మహోత్సవానికి సహకరించాలని వారు కోరారు. ప్రతి ఏటా ఈ ఏడాది ఉత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 3లక్షల మంది ఉత్సవానికి తరలిరానున్నట్లు వారు తెలిపారు. తమ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటుకు సహకరించాలని వారు కోరారు.

హైవే కూడలిలో సిగ్నల్ లైట్ల ఏర్పాటుకు సన్నాహాలు

సీఐ వినోద్‌బాబు



కశింకోట : కశింకోట కూడలిలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకల రద్దీ వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, ప్రజలు, వాహన చోదకులు రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. దీని నివారణకు రాజమహేంద్రవరంలోని జాతీయ రహదారి పీడీ దృష్టికి తీసుకెళ్లి ఇక్కడ కూడలి వెడల్పు చేసి సిగ్నల్ లైట్లు, రోడ్డుపై లైటింగ్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఈలోగా స్టాప్ బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామ పండగలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందాలు, పేకాట, గుండాటలు ఆడరాదన్నారు. స్టేజి కార్యక్రమాలకు మైక్ ఏర్పాటు చేయడానికి డీఎస్పీ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఇళ్లు విడిచి దూరం ప్రయాణాలకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాల ఇళ్ల వద్ద పోలీసు నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల విసన్నపేటలో చెక్కా కుమారి ఇంట్లో జరిగిన బంగారం దొంగతనం కేసును, బయ్యవరంలో బరుకు గోవింద్ హత్య కేసును ఒక రోజులోనే ఛేదించగలిగామని, ఇందుకు ఉన్నతాధికారుల ప్రోత్సాహం, ప్రజలు, సిబ్బంది సహకారంతో సాధించగలిగామన్నారు. ఇకపై కూడా నేరాల నియంత్రణకు ప్రజలు తమ సహకారం అందించాలన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు అందజేత



మురళీకృష్ణకు కరపత్రాలు, అక్షింతలు అందిస్తున్న రాజేశ్వరి

అనకాపల్లి : అయోధ్య రామమందిరం పునర్నిర్మాణంతో కల నెరవేరడం మనందరి అదృష్టమని నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అన్నారు. శ్రీరామచంద్రమూర్తికి సమర్పించిన అక్షింతలు శ్రీవారిసేన సమితి ఆర్గనైజర్ దాడి రాజేశ్వరి ఆలయంలో చైర్మన్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభ వేడుకలను ఇక్కడి ఆలయంలో టీవీల ద్వారా ప్రసారం చేస్తామన్నారు. ఉదయం రామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్వామివారి అక్షింతలు, కరపత్రాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తల కమిట మెంబర్లు కొండూరు రవీంద్రనాథ్, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, గొల్లవిల్లి నర్సింగరావు, మళ్లవరపు ఈశ్వరరావు, బుద్ధ నర్సింగరావు, పాము సన్నిబాబు, కంటపల్లి శోభారాణి, ఆలయ అర్చకులు యనమండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాడిపశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీ సింహాద్రప్పడు

కోటవురట్ల : పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు ఉత్తమ సేవలు అందుతున్నాయని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రప్పడు తెలిపారు. పాములవాక పశు సంవర్ధశాఖ పరిధి రామన్నపాలెంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ చిన అప్పన్న శిబిరాన్ని ప్రారంభించగా పశువైద్యాధికారులు పాడి పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స అందించారు. అనంతరం సర్పంచ్ చిన అప్పన్నను ఏడీ సింహాద్రప్పడు సత్కరించారు. డాక్టర్ హరిప్రియ మాట్లాడుతూ ఈ శిబిరంలో ఎదకు రాని 66 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 17 లేగ దూడలకు నట్టల నివారణ మందులు, అనారోగ్యంతో ఉన్న పది పశువులకు చికిత్స అందించినట్టు తెలిపారు. శిబిరంలో పశు వైద్యాధికారులు డా.ప్రతాప్, డా.బాబూరావు పడాల్, డా.శిరీష, పారా వెట్స్, పశు సంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థ మహోత్సవం



మామిడివాడలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం



పైడితల్లమ్మ తీర్థ మహోత్సవంలో జనసందోహం

రాంబిల్లి : మామిడివాడ గ్రామంలో గురువారం పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భారీగా తీర్థ మహోత్సవం జరిగింది. పెద్ద ఎత్తున తరలి వచ్చిన జనంతో ప్రాంగణం నిండిపోయింది. పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. రంగుల రాట్నాలు ఎక్కేందుకు జనం పోటీ పడ్డారు. కొప్పుగొండుపాలెం, వెంకటాపురం గ్రామాల్లోనూ గురువారం సీతారాముల తీర్థమహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తప్పెటగుళ్లు, కోలాటాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

విశాఖ డెయిరీ అభివృద్ధికి తోడ్పడండి



పాడి రైతులకు దుప్పట్లు అందిస్తున్న సంఘ మాజీ అధ్యక్షుడు ప్రసాద్

కోటవురట్ల : పాడి రైతులకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తున్న విశాఖ డెయిరీ అభివృద్ధికి రైతులు సహకారం అందించాలని సంఘ అధ్యక్షురాలు సూరిశెట్టి సత్యవతి కోరారు. రాజుపేట విశాఖ డెయిరీ సంఘ కార్యాలయం వద్ద పాడి రైతులకు సంక్రాంతి బోనస్ అందజేశారు. అనంతరం పాడి రైతులకు పశువైద్యాధికారి డాక్టర్ సూరిశెట్టి జగదీష్ సహకారంతో దుప్పట్లు అందజేశారు. లేగదూడల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఉత్తమ లేగ దూడల పోటీ నిర్వహించి రైతులకు బహుమతులు అందజేశారు. సత్యవతి మాట్లాడుతూ రాజుపేట రైతులు డెయిరీ అభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుంటారని కితాబునిచ్చారు. 180 మంది రైతులకు బోనస్‌గా రూ.3.25 లక్షలు అందించినట్టు తెలిపారు. పాడి పశువుల కొనుగోలుకు 14 మంది రైతులకు రూ.8.40 లక్షలు సొసైటీ ద్వారా అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ మాజీ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులఆత్మీయ సమావేశం

ఎస్.రాయవరం : ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు గురువారం కలుసుకుని సందడి చేశారు. 2010–11 సంవత్సరాల్లో 10 వ తరగతి చదువుకున్న విద్యార్థులు 13 ఏళ్ల తరువాత కటుంబ సమేతంగా కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వర కు గడిపి ఆనందించారు.దీంతో పాఠశా లలో సందడి వాతావరణం నెలకొంది.

పెదపాడు రామాలయంలో భరతమాతకు పూజలు



భరతమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని పెదపాడు రామాయలంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం భరతమాతకు పూజలు నిర్వహించారు. యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి రమణ, ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావులు మాట్లాడుతూ భరతమాత ఒడిలోనే సంస్కృతి సంప్రదాయాలు,ఉపనిషత్తులు వెలిసాయని తెలిపారు. ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్టను వీక్షించాలని, ప్రతి ఇంట ఐదు దీపాలు వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో జనపరెడ్డి వెంకట శ్రీనివాసరావు, కృష్ణారావు, ద్వారపురెడ్డి చిలరమ్మ పాల్గొన్నారు.

నిరుపేదలకు వస్త్రాల పంపిణీ



పేదమహిళకు చీర అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

అనకాపల్లి : పట్టణంలో గవరపాలెం పీలావారి గౌరీపరమేశ్వరుల ఆలయంలో గురువారం శ్రీ వినాయక గౌరీ సేవాసమితి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు 300 మంది నిరుపేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురస్కరించుకొని పేదలకు వస్త్రదానం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు మారిశెట్టి జగన్నాథరావు, సహాయ కార్యదర్శి దాడి రామకృష్ణ, నిర్వాహకులు పాల్గొన్నారు.